# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-03-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల ప్రజలు ఈ రోజు శ్రీ విశ్వావసు నామ తెలుగు సంవత్సర ఉగాది పర్వ దినాన్ని సంప్రదాయమబద్ధంగా జరుపుకుంటున్నారు.**
2. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ఉగాది ఉత్సవాల్లో పాల్గొననున్నారు.**
3. **హిమాచల్ ప్రదేశ్‌తో విద్యుత్ ఒప్పందం చేసుకోవడం గొప్ప ముందడుగని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు.**
4. **ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా పురస్కారాలను ప్రకటించింది.**
5. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం ఈ ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**

==========================

ఆంధ్ర ప్రదేశ్,తెలంగాణా రాష్ట్రాల ప్రజలు ఈ రోజు శ్రీ విశ్వావసు నామ తెలుగు సంవత్సర ఉగాది పర్వ దినాన్ని ఆనందోత్సాహాలతో సంప్రదాయమబద్ధంగా జరుపుకుంటున్నారు. కొంగొత్త ఆకాంక్షలతో నూతన శ్రీ విశ్వావసు నామ సంవత్సరానికి తెలుగు ప్రజలు స్వాగతం పలుకుతూ ఈ పర్వదినాన్ని సంప్రదాయ బద్దంగా నిర్వహిస్తున్నారు. చైత్ర మాసం శుక్లపక్షంలో వచ్చే శుద్ధ పాడ్యమి నాడు ఉగాది పండుగ జరుపుకోవడం మన ఆనవాయితీ.పవిత్రమైన ఈ రోజు నుండే వసంత ఋతువు ఆరంభమవుతుంది.షడ్రుచుల సమ్మేళనంతో కూడిన పచ్చడిని స్వీకరించడం ఉగాది పండుగ ప్రత్యేకత. జీవితంలో ఎదురయ్యే కష్ట సుఖాలను సవాళ్ళను సమానంగా స్వీకరించాలని ఉగాది పచ్చడి సందేశం ఇస్తుంది. బెల్లం, ఉప్పు,చింతపండు, వేప పువ్వు,పులుపు,కారం వంటి షడ్రుచుల సమ్మేళనంతో తయారు చేసే ఉగాది పచ్చడి మన శరీరానికి ఆరోగ్య పరంగా ఎంతో మేలు చేకూరుస్తుందని ఎన్నో ఔషధ గుణాలు కలిగి వున్నాయని భారతీయ సంప్రదాయ ఆయుర్వేద వైద్య విధానం సూచిస్తోంది.

తెలుగు ప్రజలు మాత్రమే కాకుండా దేశంలో పలు రాష్ట్రాల ప్రజలు కూడా ఈ రోజు నూతన సంవత్సర పర్వ దినాన్ని జరుపుకుంటున్నారు.""గుడి పద్వా """ అన్న పేరుతో మరాఠీ ప్రజలు """ పుత్తాండు """ గా తమిళులు """ విషు """ గా మలయాళీలు , వైశాఖి గా సిక్కులు """ పొయ్ లా బైశాఖి """ గా బెంగాలీలు ఈ రోజు ఈ పండుగను నిర్వహిస్తున్నారు. కాల గమనం ..., గ్రహ స్థితిగతుల గురించి అవగాహన చేసుకునేందుకు పంచాంగ పఠనం చేయడం ఉగాది పర్వదినంలో ఒక ముఖ్య ఘట్టం.

ఇలాఉండగా..తిరుమల పుణ్యక్షేత్రంలో ఉగాది వేడుకలు ఈ తెల్లవారురఝామున ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆగమ శాస్త్ర పండితుల ఆధ్వర్యంలో పంచాంగ పఠనం, ఉగాది ఆస్థాన కార్యక్రమాలు ఈరోజు జరగనున్నాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ ఉదయం 9 గంటలకు విజయవాడలో నిర్వహించే ఉగాది వేడుకలలో పాల్గొంటారు. అనంతరం కృష్ణ జిల్లా ఆతకూర్ లోని స్వర్ణ భారత్ ట్రస్ట్ లో జరిగే ఉగాది ఉత్సవాల్లో పాల్గొంటారు .సాయంత్రం గుంటూరు జిల్లా వెలగపూడిలో పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన జీరో పావర్టీ–పీ4 కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు .

---------------------------

తెలంగాణలో పెరుగుతోన్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ– 2025కు అనుగుణంగా హిమాచల్ ప్రదేశ్‌తో విద్యుత్ ఒప్పందం చేసుకోవడం గొప్ప ముందడుగని ఉ ప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. హిమాచల్ ప్రదేశ్ నుంచి 520 మెగావాట్ల హైడల్ విద్యుత్ సరఫరాకి రాష్ట్రప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖూ....... ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమక్షంలో ఇరు రాష్ట్రాల అధికారులు నిన్న సిమ్లాలో అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ...

..వాయిస్.. 27 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా పురస్కారాలను ప్రకటించింది. సంగీతం, సాహిత్యం, నృత్యం, నాట్యం, జానపదం, జర్నలిజం వంటి పలు విభాగాలలో విశిష్ట ప్రతిభ కనపరచిన వారికి పురస్కారాలను ఇవ్వనున్నారు. వీరిలో కళా రత్న పురస్కారాలకు 86 మందిని ఎంపిక చేయగా, ఉగాది పురస్కారాలకు 116 మందిని ఎంపిక చేసినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి తెలిపింది. కళా రత్న పురస్కారాలకు ఎంపికైన వారిలో కృత్తివెంటి శ్రీనివాసరావు, కంపెల్ల రవిచంద్రన్, ద్వారం లక్ష్మి, బి.సరిత, పసుమర్తి వెంకటేశ్వర శర్మ, వేమూరి బలరాం తదితరులు ఉన్నారు. అలాగే ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగంలో న్యూస్ రీడర్ గా పనిచేస్తున్న కనపర్తి రాణి ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు.

కాగా ఈ పురస్కారాలను ఈరోజు విజయవాడ తమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్‌లు ప్రధానం చేయనున్నారు .

---------------------------

హైదరాబాద్ నగరంలో ప్రజా అవసరాలకు అనుగుణంగా లింక్ రోడ్లు నిర్మించాలని ముఖ్యమంత్రి ఎ,రేవంత్ రెడ్డి సూచించారు. హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చేపడుతున్న అనుసంధాన రహదారుల నిర్మాణం, విస్తరణపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. హెచ్ఎండీఏ పరిధిలోని 49 రోడ్ల నిర్మాణం, విస్తరణపై ఆయన పలు సూచనలు చేశారు. వివిధ ప్రాంతాల అనుసంధానం, నిరంతరాయ0గా రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారులు నిర్మించాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

ఏకకాల ఎన్నికలతో భారత దేశానికి ప్రయోజనమని పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అభిప్రా0 వ్యక్తం చేశారు . విజయవాడలో నిన్న “ఒకే దేశం – ఒకే ఎన్నిక” అంశంపై నిర్వహించిన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు గొప్ప, విచక్షణతో ఓటు

వేస్తారని స్పష్టం చేశారు. లోక్ సభకు, రాష్ట్రాల శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు జరిగినా కేంద్రంలో ఎవరిని అధికారంలోకి తీసుకురావాలి, రాష్ట్రంలో ఎవరికి అధికారం ఇవ్వాలి అన్న విషయంలో వారికి స్పష్టత ఉంటుందని ఆయన తెలియజేస్తూ...

వాయిస్: 30 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక ఈ ఉదయం 11 గంటలకు ప్రసారం అవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

తెలంగాణలో రేపు సెలవుగా ప్రకటించినప్పటికీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. లే అవుట్ల క్రమబద్ధీకరణ పథకం –ఎల్ఆర్ఎస్ అమల్లో భాగంగా గత నాలుగేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసుకునే వీలు కల్పించింది. ఎల్ఆర్ఎస్ ఫీజులోనూ 25% రాయితీ ఇవ్వనుంది. పైగా సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులోనే నేరుగా క్రమబద్ధీకరణ ఫీజును చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించింది. రేపటి లోగా రుసుము చెల్లించిన వారికి ఈ రాయితీ వర్తిస్తుందని వెల్లడించింది.

---------------------------

విశాఖపట్నం వేదికగా ఐపీఎల్‌లో నేడు మరో ఆసక్తికర మ్యాచ్ జరగనుంది. ఈ మధ్యాహ్నం 3 గంటల 30 నిముషాలకు డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి క్రికెట్ స్టేడియంలో జరిగే ఈ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు తలపడుతుంది. కాగా గత రాత్రి జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ జట్టు తొలి విజయాన్ని నమోదు చేసింది.ముంబయి ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 36 పరుగుల తేడాతో విజయం సాధించింది.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 29 సెకన్లు....

కాగా తెలంగాణాలో నేటి నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు పొడి వాతావరణం కొనసాగుతుందని వాతావరణ శాఖ పేర్కొంది. ఏప్రిల్ 2, 3, 4 తేదీల్లో రాష్ట్రంలో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది.

=====================